డి.వి.సి.బి సేవలు వినియోగించుకోవాలి

బ్యాంక్ డైరెక్టర్ జె.వి.సత్యన్నారాయణమూర్తి

విశాలాంధ్ర - పలాస : ది విశాఖపట్నం కొపరేటివ్ బ్యాంక్ అందజేస్తున్న సేవలను ఖాతాదారులు ఉపయోగించుకోవాలని డి.వి.సి.బి డైరెక్టర్‌లు జె.వి. సత్యన్నారాయణమూర్తి (నాని), సీఏ శాస్త్రిలు అన్నారు. పలాస బ్రాంచ్ 10వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం బ్యాంక్ ఆవరణలో కిమ్స్ ఆసుపత్రి (శ్రీకాకుళం) సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, చిన్న వ్యాపారులకు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి విద్య, వైద్య సంస్థల అభివృద్ధికి వృత్తికారులకు వివిధ రుణాలను బ్యాంక్ అందజేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షేర్ హెూల్డర్లుకు భాగస్వామ్యం చేస్తూ బ్యాంక్ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్‌లోను ఇదే రకం సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని అన్నారు. బ్యాంక్ సభ్యులుగా చేరిన వారికి ఆరోగ్య ఇన్యూరెన్సు అమలు చేస్తున్నామని, ప్రతిభ కనబర్చిన సభ్యుల పిల్లలకు పారితోషకాలు అందిస్తున్నామని తెలిపారు. తమ బ్యాంక్‌లో జీరో బ్యాలెన్స్‌తో ఖాతా ప్రారంభించవచ్చని, వారికి కూడా సేవలు అందిస్తుందని అన్నారు. దిగువ మధ్య తరగతి ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తేవాలని, వారు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి బయట పడేందుకు సహకార బ్యాంక్ ఆలోచిస్తుందని అన్నారు. వారికి రుణం మంజూరు చేసి దినసరి సులభ వాయిదాల ద్వారా తక్కువ వడ్డీతో వసూలు చేసే పథకం బ్యాంక్‌లో అందుబాటులో ఉందని పలాస కాశీబుగ్గలో గల చిరువ్యాపారులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ జాతీయ బ్యాంక్‌ల కన్నా ది వి.సి.బి బ్యాంక్ ఖాతాదారులకు సేవలు అందించడంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ జి.రమణమూర్తి మాట్లాడుతూ సహకార రంగ బ్యాంకుల్లో డి.వి.సి.బి ముందంజలో ఉందని ఖాతాదారులకు అందుబాటులో ఉంటూ వారి ప్రయోజనాలను కాపాడుతుందని అన్నారు. అనంతరం వైద్య శిబిరంను ప్రారంభించారు. శిబిరంలో హాజరైన 200 మందిని కిమ్స్ వైద్యులు ఎం.రమణారావు ఉచితంగా కార్డియాక్ స్క్రీనింగ్, షుగర్ మరియు బి.పి పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి.సింహాద్రి, బ్యాంక్ సిబ్బంది క్రాంతినాయిక్, దుర్గారావు, భరత్, కిమ్స్ మార్కెటింగ్ మేనేజర్ డోల లవకుమార్, నేషనల్ కన్జూమర్ కమిషన్ వైస్ చైర్మన్ కుమార్ నాయిక్, పలాస నియోజకవర్గ సీపీఐ నాయకులు చాపర వేణుగోపాల్‌లతో పాటు కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయానికి స్థలం మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కోట బొమ్మాళి : వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యా లయంలో కోసం కోట బొమ్మాళి మండల కేంద్ర ంలో స్థలం మంజూరు చేయా లని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమా మల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజులు పార్టీ నాయకులతో కలిసి సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మెండ తాత, తర్ర అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

కాపుగోదాయవలసలో కబడ్డీ, డాన్స్ పోటీలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం కాపు గోదాయవలస గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా, కబడ్డీ మరియు డ్యాన్స్ పోటీలు నిర్వహించబడతాయని ఆలయ నిర్వాహకులు కుత్తుమ శివప్రసాద్ తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు డివిజనల్ స్థాయి కబడ్డీ పోటీలు, 18న గ్రూపు డాన్స్ పోటీలు నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. కబడ్డీలో ప్రథమ స్థానం పొందిన జట్టుకు పదివేల రూపాయలు నగదు బహుమతి, ద్వితీయ స్థానం పొందిన జట్టుకు 5000 రూపాయలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే డ్యాన్స్ పోటీల్లో ప్రథమ బహుమతి పదివేల రూపాయలు, ద్వితీయ బహుమతి 5000 రూపాయలు, తృతీయ బహుమతి 3000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనవలసిన కబడ్డీ మరియు డాన్స్ కు సంబంధించిన ప్రతినిధులు శివాలయం పీఠాధిపతి ఉత్తమ శివప్రసాదరావును, ధనుంజయ ఫోన్ నెంబర్ 9182490791, తేజ ఫోన్ నెంబర్ 6302948946 సంప్రదించవలసిన సంప్రదించాలని కోరారు.

తలశిల కుటుంబానికి మంత్రి డా.సీదిరి పరామర్శ

విశాలాంధ్ర - పలాస : వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాము సతీమణి స్వర్ణకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విజయవాడ శివారు ప్రాంతంలో గొల్లపూడిలో నివాసముంటున్న తలశిల రఘురామ్ ఇంటికి వెళ్లి ఓదార్చి తీవ్ర సంతాపం తెలిపారు. ఈయన వెంట పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావులు ఉన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం చిన్నతుంగాం,, కృష్ణచంద్రపురం పాఠశాలలను సంతబొమ్మాళి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బరాటం కామరాజు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అలాగే పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహణ పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. ఆయా కార్యక్రమాల్లో, ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ గ్రామానికి చెందిన బొంతల తవిటిరాజు ఇటీవల ప్రమాదానికి గురై కాలు విరిగి పోయింది. దీంతో ఈయన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న 19వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్టు గోపి 6వేల రూపాయలు, 2వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి, కన్వీనరు బడగల బల్లయ్య 2 నెలలకు సరిపడే నిత్యవసర సరుకులు సోమవారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో తోట సిమ్మయ్య, మాణిక్యం, సారధి, మార్పు చిన్న, తోట రాము, రామస్వామి, పున్నయ్య, గురయ్య, స్వాతిలు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న తలపాగా ఊరేగింపు

విశాలాంధ్ర - పొందూరు : ఈనెల 18న జరిగే మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం మల్లన్న కోసం రూపొందించిన తలపాగా, వస్త్రాలను సోమవారం ఇక్కడ ఊరేగించారు. స్థానిక లావేటి వీధికి చెందిన చేనేత కార్మికుడు కందాన శంకరరావు కుటుంబ సభ్యులు ఈ వస్త్రాలను నేసారు. నెల రోజులు పాటు శ్రమించి వస్తాలను అపురూపంగా తీర్చిదిద్దారు. మల్లికార్జున స్వామికి 160 మీటర్ల పొడవు, 48 సెం.మీ వెడల్పు గల తలపాగా నేసారు. భ్రమరాంబకు 6 మీటర్ల పసుపు అంచు చీర శెనగల బసవన్నకు 6 మీటర్ల ఎరుపు అంచు పంచె అదే విధంగా సాక్షి గణపతికి మూడు మీటర్ల అంచు పంచెలను నేసారు. వాంద్రంగి వీదికి చెందిన ఆకాశం ముఖలింగం 33 సార్లు శ్రీశైలం వెళ్ళి వస్త్రాలను సమర్పించారు.

వన్డే కాంట్రిబ్యూషన్ నగదు చెక్కు అందజేత

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డ్‌నకు జిఆర్.రాధిక వన్డే కాంట్రిబ్యూషన్ చెక్కును అందజేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో, శ్రీకాకుళం యూనిట్ హెూంగార్డ్ గా విధులు నిర్వర్తిస్తు, గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన బి వేణుగోపాల్ కు సహ ఉద్యోగులు సహాయార్థంగా జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న హెూంగార్డ్స్ అందరి ఒక రోజు వేతనాన్ని సేకరించి మొత్తం 4,30,260లు కాంట్రిబ్యషన్ నగదు చెక్కును, ఆయనకు అదనపు ఎస్పీ చేతులు మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఏ అవసరమైనా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి సంప్రదించవచ్చని. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. బి.ప్రదీప్ పాల్గొన్నారు.

అరసం అధ్యక్ష వర్గంలో నల్లి ధర్మారావు

80 ఏళ్ల చరిత్రలో శ్రీకాకుళం జిల్లాకు తొలి గౌరవం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర అధ్యక్ష వర్గంలో శ్రీకాకుళం జిల్లాకు తొలి సారి ప్రాతినిధ్యం లభించింది .తెనాలిలో జరిగిన మహాసభల్లో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది .అధ్యక్ష వర్గంలో అయిదుగురు ప్రసిద్ధ సాహితీవేత్తలు ఉంటారు.మూడేళ్ల వరకూ కొనసాగే ఈ కార్యవర్గంలో ప్రముఖ కథా, నవలా రచయిత డాక్టర్ కేతు విశ్వనాథ రెడ్డి (అనంతపురం), యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఈశ్వర రెడ్డి (కడప), ద్రవిడ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కిన్నెర శ్రీదేవి (కుప్పం), ప్రముఖ సినీ రచయిత సాయి మాధవ్ (గుంటూరు)తో పాటు నల్లి ధర్మారావు (శ్రీకాకుళం) ఎన్నికయారు. నూతన కార్యవర్గాన్ని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రతిపాదించగా, మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.జర్నలిస్టుగానే కాకుండా ధర్మారావు కవిగా,రచయితగా తెలుగు రాష్ట్రాలలో సుపరిచితులు. 2018లో ప్రజా పాటల కవిగా గుర్రం జాషువా అవార్డు, కవితా విభాగంలో రావి రంగారావు సాహిత్య పీఠం అవార్డు, జర్నలిజం విభాగంలో తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, దూసి ధర్మారావు స్మారక అవార్డు వంటివి అందుకున్నారు. అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గానికి ఎన్నికైన సందర్భంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టు నాయకులు ఎన్.ఈశ్వరరావు, కూన పాపారావు, ఎంవి మల్లేశ్వరరావు, అరసం జిల్లా నాయకులు డాక్టర్ జ్యోతి ఫ్రెఢరిక్, కలమట దాసుబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కుంభ సంక్రమణం

విశాలాంధ్ర - ఇచ్చాపురం : ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంభ సంక్రమణం సందర్భంగా ఎలయన్స్ క్లబ్ పి.ఆర్. ఓ దక్కత గోపీనాథ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉదయం అమ్మవారికి మేలుకొలుపు మర్ధన అభిషేకాలు చేసి అర్చనలు జరిపారు.

ఉపాధి హామీతో వలసలు నివారణ : సర్పంచ్ నారాయణస్వామి

విశాలాంధ్ర - కవిటి : ఉపాధి హామీతో గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తుందని సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామపంచాయతీ పరిధిలోని పొందల వాని చెరువులో ఉపాధి హామీ పనులను సర్పంచ్ ఎస్పీ నారాయణ స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ నారాయణస్వామి మాట్లాడుతూ 80 మంది వేతన దారులతో పొందలవాని చెరువు లో ఉపాధి హామీ పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వీవీఎస్ రాంబాబు,ఎస్ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ సర్వేశ్వరరావు, ఉపాధి హామీ వేతనదారులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవహారాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : విద్యార్థులంతా బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా మోసాల బారినుండి తప్పించుకోవచ్చునని యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలిలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులతో ప్రత్యేక కార్య క్రమం నిర్వహించడం జరిగింది. డిజిటల్ బ్యాంకింగ్, ఏటీఎం కార్డుల వినియోగం, పిన్ నెంబర్ల వాడకం తదితర అంశాలపై విద్యార్థులకు పవర్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు సీ. హెచ్.వెంకటేష్, రామారావు ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు ధనుంజయ రావు, లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి, రమేష్ సాహూ, వినోద్ రాజు, శ్రీనివాసరావు, విజయ, సంగీత, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - అరసవల్లి : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి హుండీలను నేడు లెక్కించనున్నట్లు సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 14వ తేది మంగళ వారం ఉదయం 08.00గం.లకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త, అర్చకులు, భక్తులు మరియు గ్రామపెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కి మొదటి ప్రాధాన్యత ఓటు దక్కేలా కృషి చేద్దాం

ఎమ్మెల్యే బెందాళం అశోక్

విశాలాంధ్ర - కవిటి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడా చిరంజీవి రావు కి మొదటి ప్రాధాన్యత ఓటు దక్కేలా ఇచ్ఛాపురం నియోజకవర్గం టిడిపి కుటుంబ సభ్యులు అందరూ కృషి చేద్దాం అని ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే అశోక్ క్యాంప్ ఆఫీస్ వద్ద అశోక్ ను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడా చిరంజీవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని అన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు భిన్నంగా మారాయని వైసీపీ పాలనతో ప్రజలు విసుకు చెందారని అన్ని వర్గాల ప్రజలు బాధలు పడుతున్నారని అన్నారు. అన్నింటితో పాటు చదువుకున్న వ్యక్తి కూడా బాధలను ఎదుర్కొంటున్నాడని, ముఖ్యంగా ఉద్యోగస్తుల బాధలు వర్ణనాతీతమణి గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన ఉపాధ్యాయులు నేడు రోడ్లపైకి ఎక్కి ప్రభుత్వానికి దుయ్యబడుతున్నారని అన్నారు. వారి ప్రయత్నాలను అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా కుటిల ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఒక మంచి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున ఒక ఉన్నతమైన మాస్టారు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ ప్రకటించడం శుభ పరిణామం అన్నారు.వేపాడా చిరంజీవి రావు మాస్టారుకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వేలాదిమంది విద్యార్థులు శిష్యులుగా ఉన్నారని వారిలో కొంతమంది ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. అలాగే మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రతి ఒక్క పట్టభద్రుడికి ఆయన పేరు తెలియటం తనకు ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. ఏది ఏమైనాప్పటికీ బ్రాండ్ ఇమేజ్ తో గెలుపు సొంతం కాదని బ్రాండ్ ఇమేజ్ ఓటుగా మలిచినప్పుడే విజయం సొంతమవుతుందని అన్నారు.ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వేపాడ చిరంజీవి రావు ని మొదటి ప్రాధాన్యత ఓటును కల్పించేందుకు ప్రతి ఒక్క తెలుగు దేశం నాయకుడు, కార్యకర్త అండదండలతో కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ 1982 వ సంవత్సరం వరకు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ గల్లీలో తాకట్టు పెడుతున్న సమయంలో మహానటుడు, నటసార్వభౌముడు, నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దక్షిణ భారతదేశం తోపాటు ప్రపంచ వ్యాప్తంగా వ్యాపింప చేసిన మహా నేతకు మొదటగా నివాళులర్పి స్తున్నానని అన్నారు.ఆంధ్ర రాష్ట్రంను ఒక విజన్ తో ముందుకు నడిపించడానికి నారా చంద్రబాబు నాయుదు తన పాలనలో ఎంతో కృషి చేశారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న హైదరాబాదుకు ఒక బ్రాండ్ ఇమేజ్ ను తీసుకు వచ్చింది చంద్రబాబు అని గుర్తు చేశారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని అన్నారు.రైతు బజార్లను ఏర్పాటు చేసి సామాన్యులకు అతి తక్కువ ధరకే కూర గాయలను అందజేసిన ఘనత చంద్రబాబుది అన్నారు.నేటి పరిస్థితులు దృష్ట్యా రాష్ట్రం లో ప్రజలకు చంద్రబాబు పరిపాలన ఎంతో అవసరమని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఒక రోజు సమయంలోనే నియోజకవర్గ నాయకు లందరినీ సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అశోక్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యే అశోక్ అండ దండలతో ప్రతి ఒక్క కార్యకర్త,నాయకుడు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు కల్పించేందుకు పట్టభద్రుల వద్దకు వెళ్లి తనకు ప్రాధాన్యత కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాలు, ఇచ్చాపురం మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

- ప్రభుత్వానికి ప్రజల కష్టాలు తెలియవు

- టీడీపీ జిల్లా అధ్యక్షులు 'కూన'

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఉపాధి పనులకు వెళుతున్న వారిపై లారీ దూసుకుపోయి నలుగురు దుర్మన్నం పాలైన ఘటనలో బాధిత కుటుంబాలకు 25 లక్షల నష్ట పరిహారాన్ని ప్రభుత్వం తక్షణమే అందించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ విప్ కూన రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం లారీ ప్రమాదంలో మృతి చెందిన మండాది గ్రామ బాదిత కుటుంబాలను పరా మర్శించి ప్రమాద ఘటనలు తెలుసుకున్నారు. వారితో పాటు ఉన్న కూలీలు ప్రత్యక్ష సాక్షులుగా జరిగిన ఘటనను వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు ప్రమాదాలు సంభవించి నప్పుడు బాధిత కుటుంబాలను పాలకులు పరామర్శించి ఆదుకోవలసిన అవసరం లేదా అని ప్రశ్నించారు. సుమారు మూడు లక్షల కోట్ల రూపాయలు ఆదాయం ప్రభుత్వానికి వస్తున్నప్పటికీ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫండ్ ఏర్పాటు చేయకపోవడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధ్యత లేని విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే బాధ్యత కుటుంబాలకు 25 లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజల కష్టాలు గుత్తెరిగి సహాయ సహకారాలు అందించాల్సిన వారు నేటికీ పరిహారం ఇవ్వక పోవడంతో ప్రభుత్వ పనితీరును దుయ్యబట్టారు. కూలి పని చేస్తూ జీవిస్తున్న వారి కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందాల్సిన బీమా పథకాలన్నీ తక్షణం అందాల చూడాలని కోరారు. ఉపాధి హామీ పనులకు వెళుతూ మృతి చెందిన వారికి మెప్మా పిడి ద్వారా సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వారికి రావలసిన ఇన్సూరెన్సు గూర్చి అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తెలుసు కున్న రవి కుమార్ సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వంలో ఉన్న వారి వాహనాలు కావడంతో నామ మాత్రపు కేసులు నమోదు చేయటంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

పాలకులకు బాధితల కష్టాలు పట్టవా...

ఉపాధి పనులకు వెళుతూ లారీ ప్రమాదంలో దుర్మరణం పాలైన కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత పాలకులపై ఉందని, కనీసం తక్షణ సాయం అందించాల్సిన చర్యలు నేటికీ చేపట్టకపోవడం పై మండిపడ్డారు. జిల్లాలో ఉన్న మంత్రులు, స్పీకర్, బాధితులను ఆదుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహి స్తున్నారు అర్థం కావడం లేదన్నారు. కేవలం అధికార పార్టీ నాయకులకు చెందిన వాహనం కావడంతో కేసును నీరుగాచేందుకు అధికార పార్టీ వ్యవహరిస్తుందని విమర్శించారు. టిడిపి హయాంలో రెండు కోట్ల 44 లక్షల మందికి ఇన్సూరెన్స్ చేసి మృతి చెందిన కుటుంబాలకు బీమా ఐదు లక్షల అందించేవారని గుర్తు చేశారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం మాటలకు కాగితాలకే పరిమితమైందని ప్రజలకు పరిహారం అందించడంలో వెనుకబడిందని విమర్శించారు. కుటుంబాలను ఆదుకోవాలని వారి కుటుంబాలకు ఉపాధి అవకాశాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతోపాటు సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి రావు, సూర్యం, మల్లేశ్వరరావు, సింహాచలం, కృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌జీఎఫ్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రమైన కవిటిలో ఎస్ జీఎఫ్ వార్షి కోత్స వాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సంద ర్భంగా యువ కులకు ఫైవ్ కే రన్ కార్యక్రమం చేపట్టి విజేతలకు బహుమతులను అంద జేశారు. అనంతరం ఎస్‌జిఎఫ్ ప్రేరణతో నిర్మించిన ఎస్జీఎఫ్ అనే సినిమాను స్థానిక మహాలక్ష్మి థియేటర్ లో ప్రదర్శించారు.ఉద్దాన ప్రాంతంలో ఉన్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఎస్‌జిఎఫ్ మొబైల్ యాప్ లాంచ్ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ సంఘ సభ్యులు,ఉద్దాన ప్రాంతంలో వివిధ సంఘాల ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాలబాలికలతో పనులు చేయించడం నేరం

విశాలాంధ్ర - మెళియాపుట్టి : పద్దెనిమిది సంవత్సరాలు దాటని బాల బాలికలతో పనులు చేయించడం నేరమని పలువురు అధికారులు అన్నారు. సోమ వారం వారు మెళియా పుట్టి మండలంలోని చాపర గ్రామంలో గల పలు ఫ్యాక్టరీలు, రైస్ మిల్లలను తహ శీల్దారు ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ అధికారులు, ఎస్ఈబి సిబ్బంది, స్థానిక పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అక్కడ సిబ్బందితో మాట్లాడుతూ పద్దెనిమిదేళ్ల పూర్తికాని బాలబాలికలకు పనిలో చేర్చు కోవద్దని, అలా కాకుండా చేర్చుకుంటే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ సందర్శనలో తహశీల్దారుతో పాటుగా పలువురు సిబ్బందిలు పాల్గొన్నారు.

పచ్చని మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడండి

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : పచ్చని మొక్కలను నాటి పర్యావరణంను కాపాడండి అని లయన్స్ క్లబ్,ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సక్షమ్ జిల్లా కన్వీనర్ లయన్స్ డా॥ఎం.కె.మిశ్రో అన్నారు. సోమవారం మండలంలోని చిన్నకొల్లివలస, మోదుగువల ఆర్&ఆర్ కోలనీ శివాలయం ప్రాంగణం నందు ఉచితంగా రుద్రాక్ష మొక్కలను ఇచ్చి, వాటిని నాటారు. ఈ కార్యక్రమంలో మోదుగువలస ఆర్&ఆర్ కోలనీ సర్పంచ్ రెడ్డి రామారావు, శివాలయం అర్చకులు వి.శంకరరావు, మరియు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మిశ్రో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు.సర్పంచ్ రెడ్డి రామారావు మాట్లాడుతూ మిశ్రో చేస్తున్న సేవాకార్యక్రమాలు భేషుగా ఉన్నాయని అన్నారు.

భూమి రీ సర్వే చేపట్టండి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - కంచిలి : మండలంలోని కె.బి నౌగాం పంచాయతీలో భూమి రి సర్వే చేపట్టాలని సిపిఐ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా నాయకులు చాపర సుందర్లాల్, సాలిన నారాయణస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మండలంలోని అన్ని పంచాయతీలలో, గ్రామాల్లో రిసర్వేలు చేశారని, తమ పంచాయతీ పరిధిలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన్నారు. సిపిఐ నాయకులు మాట్లాడుతూ అధికారులు తక్షణమే స్పందించి భూమి రి సర్వే చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె తరిణి, పైడితల్లి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం సిగ్గుపడుతోంది : మాజీ ఎమ్మెల్యే శివాజీ

విశాలాంధ్ర - పలాస : వైసీపీ పార్టీ రక్త సంబంధికులను సైతం అధికారం కోసం కడ చేర్చి కుర్చికి పాకులాడే మనుషలను చూసి ప్రజాస్వామ్యం సిగ్గు పడుతోందని మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ అన్నారు. సోమవారం పలాస టీడీపీ కార్యా లయంలో జగనాసుర రక్త చరిత్ర పుస్తకం మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇంతటి దిగ్భ్రాంతికరమైన విషయాలు చూడలేదని, రాజకీయాలు ఆరోగ్యకరంగా ఉండాలే గాని హానికరంగా ఉండకూడదని హితవు పలికారు. వివేక నందరెడ్డి హత్య కేసు సిబిఐ త్వరలో చేధిస్తుందని, నిజనిజాలు ప్రజలకు తెలుస్తాయని అన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటే మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ పార్టీపై కసి తీర్చుకుంటారని అన్నారు. కార్యక్రమలో విఠల్, మోహనరావు, దుర్యోదన, నాగరాజు, లక్ష్మణకుమార్, సంతోష్, శశిభూషణ్, ఉమామహేశ్వరరావు, కూర్మారావు, సాంబమూర్తి, నవీన్‌లు పాల్గొన్నారు.

వేపాడ విజయం లాంఛనమే : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్తిగా వేపాడ చిరంజీవిరావు విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే శివాజీ పిలుపునిచ్చారు. చంద్రబాబు ఒక మంచి విద్యావంతుడును అభ్యర్థిగా ఎంపిక చేయడం శుభపరిణామమని, చిరంజీ విరావును ఎంపిక చేసిన వెంటనే అతను సగం గెలు పొందారని అన్నారు. అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, జాబ్ క్యాలెండరు ప్రతి ఏటా విడుదల చేస్తామని మభ్య పెట్టి అధికారం చేపట్టిన ఈ ప్రభుత్వం జాబ్ కేలండరు విడుదలలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. భవిష్యత్ ఎన్నికలకు ఇదే ప్రారంభం కావాలని అన్నారు.

ప్రోటోకాల్ పాటించాలి

దేవాదాయ శాఖ ఏసీ హరిసూర్యప్రకాశరావు

విశాలాంధ్ర - జలుమూరు : శ్రీముఖలింగేశ్వర స్వామి వారి శివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏటా ఎదురవుతున్న ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి ఆలయ అధికారులు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా లింగోద్భావానికి వంశపారంపర్య ధర్మకర్త మహారాణి కళ్యాణి గజపతి ప్రత్యేక అతిథిగా వచ్చే సమయంలో వందల మంది ప్రవేశిస్తూ ప్రోటోకాల్ నిబంధనలు పాటించకుండా ఆమెకు ఇబ్బంది కలిగిస్తున్నారని, అదేవిధంగా వీఐపీ లంటూ అంతరాయం లోకి ప్రతి ఒక్కరు ప్రవేశిస్తున్నారని దీనిపై చర్యలు చేపట్టాలని కోరగా, దేవాదాయ శాఖ ఏసీ హరి సూర్య ప్రకాశరావుకి వెంటనే దీనిపై విచారణ జరిపించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆయన సోమవారం స్వామివారి ఆలయానికి చేరుకొని లింగోద్భం జరిగేటప్పుడు మహారాణితో అర్చకులు మాత్రమే ఉండాలని, ఇతరులు ఎవరూ లోనికి ప్రవేశించకూడదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అన్ని ప్రోటోకాల్ నిబంధనల ప్రకారము మహారాణి కళ్యాణి గజపతి వచ్చేటప్పుడు మర్యాదలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రభాకర్‌రావు, చైర్మన్ లింగమూర్తి, పెద్ద పూజారులు నాయుడుగారి రాజశేఖర్, శేషాద్రి వెంకటాచలం ఇతర అర్చకులు పాల్గొన్నారు.

రూరల్ డవలప్‌మెంటులో పద్మినికి డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో రూరల్ డవలప్‌మెంటు విభాగంలో పరిశోధన చేసిన విద్యార్థిని ఎస్‌టీపీ పద్మినికి సోమవారం వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. మహిళల ఆర్థికాబివృద్ధి, వికాసం, స్వయం శక్తి సంఘాల పాత్ర అనే అంశంపై శ్రీకాకుళం జిల్లాను నమూనాగా తీసుకుని చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఆమె చేసిన పరిశోధనకు దివంగత ప్రొఫెసర్ మిరియాల చంద్రయ్య గైడ్‌గా, వర్సిటీ పిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య కో-గైడ్‌గా వ్యవహరించారు.

ఓం శాంతి ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రమైన కవిటి ఓం శాంతి మందిరం వద్ద సోమవారం శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముందుగా శివలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి కైలాస్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. అనంతరం భక్తులకు శివుని మహత్యం, శివరాత్రి ఉత్సవ మహత్యం గూర్చి తెలియజేసి ఓం శాంతి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఓం శాంతి కన్వీనర్ నిర్మల తెలియజేశారు. అనంతరం భక్తులకు నారాయణ సేవ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాధవరావు, కృష్ణస్వామి, ఓం శాంతి భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సందేశం ఇచ్చిన 'విద్యార్థి మేలుకో బుర్రకథ'

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బి.గొనవపుట్టుగ గ్రామానికి చెందిన బాలక లోకనాథ బుర్రకథ బృందం వారిచే విద్యార్థి మేలుకో అనే బుర్రకథను నెలవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రదర్శించారు. పెద్దలపట్ల, గురువుల పట్ల విద్యార్థులు మెలిగే తీరు, విద్యార్థులు మొబైల్ వినియో గంతో కలిగే అనర్థాలు,మైనర్లు వాహనాలు నడిపితే కలిగే అనర్థాలు, శ్రద్ధతో ఇష్టంగా చదువును అభ్యసిస్తే కలిగే లాభాలు బుర్రకథ రూపంలో విద్యార్థులకు చక్కగా వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు పి.మోహనరావు, శివరామ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోజు కూలీలపై పోలీసుల ప్రతాపం

విశాలాంధ్ర - బూర్జ : మండలంలో వందలాది మంది కూలీలు పొట్ట చేతబట్టుకుని ఆమదాలవలస పట్టణానికి చిన్న చిన్న ద్విచక్ర వాహనాలతో నిత్యం రాకపోకలు సాగి స్తుంటారు. అలాంటి సామాన్యులపై స్థానిక పోలీసులు ట్రాఫిక్ నిబంధనల పేరిట మూడు రోజుల కొకసారి ఇబ్బందులకు గురిచేస్తూ జేబులు ఖాళీ చేయిస్తున్నారు. అన్ని పత్రములు ఉన్నా హెల్మెంట్ లేదనే సాకుతో పెనాల్టీలు వేస్తూ జులుం ప్రదర్శిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడా బాబులు, రాజకీయ నేతలకు ఎటువంటి పత్రాలు లేకున్నా, బుల్లెట్ వేసుకొస్తే చాలు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారికి సైతం సలాం కొట్టి విడిచి పెట్టేస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ సాధారణ ప్రజలపై చూపిస్తున్న ప్రతాపంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సంబంధిత అధికారులకు సూచన చేయాలని ఆమదాలవలస ప్రజలు కోరుకుంటున్నారు. సిటీ ప్రిన్సెస్ లో హెల్మెట్ మినహాయింపును కూడా పరిగణంలోనికి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొండెక్కిన పుచ్చకాయ ధరలు



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : నోరూరించే పుచ్చకాయ అంటే అందరికీ ఇష్టమే. కానీ పూర్తిగా సీజన్ అందు కోకుండానే హెూల్ సెల్ ధరలే హడలెత్తిస్తున్నాయి. రిటైల్‌గా వాటి ధరలను వింటున్న కొనుగోలు దారులు బెంబేలెత్తి పోతున్నారు. గత తేడాది టన్ను పుచ్చకాయ రూ.10 వేలు ఉండగా సీజన్ వచ్చే సరికి రూ. 15 వేలు పలికింది. ఈ ఏడాది టన్ను పుచ్చకాయ ధర ప్రారంభంలోనే రూ. 15 వేలు నుంచి కాయ సైజు ఆధారంగా రూ. 20 వేలు ధర పలుకుతోంది. ప్రారంభంలోనే ఇంత ధర ఉంటే సీజన్ వచ్చే సరికి ఎంత ధర ఉంటుందో వ్యాపారులు చెప్పలేమంటున్నారు. ఈ యేదాది శ్రీకాకుళం జిల్లాలో పుచ్చకాయ సాగు చాలా తక్కువగా ఉంది. ఎక్కువగా ఈ పంట సాగు చేస్తున్న విశాఖ, పశ్చిమ, తూర్పు గోదావరి, కడప, చిత్తూరు జిల్లా నుంచి పంట ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్ల ధర పెరుగుదలకు కారణంగా పలువురు పేర్కొంటున్నారు. ఎంతో దూరంగా ఉన్న ఇతర జిల్లాల నుంచి పుచ్చకాయలు దిగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలు ధరకు ఆదనంగా సరుకు రవాణా కలవడంతో ఖర్చు కలిపి వినియోగదారుల నుంచి విక్రయదారులు వసూలు చేస్తున్నారు.

15న రహదారి భద్రతా కమిటీ సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం : రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుదవారం ఉదయం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీసమావేశం జరుగుతుందన్నారు. జిల్లాలో శాఖల వారీగా చేపట్టాల్సిన రహదారి భద్రతా కార్యక్రమాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశానికి జిల్లాలోని రహదారి భద్రతాక మిటీసభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : తన తల్లి ద్వారా వారసత్వంగా సంక్రమించి,కోర్టులు తీర్పులిచ్చిన,కోర్టు తీర్పులను ధిక్కరిస్తూ భూమికి సంబంధం లేని వ్యక్తులకు అనుకూలంగా నివేదికలిస్తున్న రెవెన్యూ అధికారులను క్రిమినల్ అప్పీల్స్ 1837/2019,1669/2009ల యందు సుప్రీం కోర్టు తీర్పులు ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోలా లలిత,కోలా నీలకంఠ రావులు కోరారు.సోమవారం నాడు శ్రీకాకుళం మండల తహశీల్దార్ కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో పాటు సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపిలు మాట్లాడుతూ కత్తిరిశెట్టి ఇందిరా బాయి ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్,శ్రీకాకుళం కోర్టు యందు ఎల్.సి.సి.9/75 లో పాత్రునివలస రెవెన్యూ గ్రామంలో పాత సర్వే నెంబరు 577,కొత్త సర్వే నెంబరు 162/4 లో మంగి రాజప్పడు సాగులో ఉన్నాడని రూఢీ ప్రకటన ఇచ్చిందని అన్నారు.ఈ రూఢీ ప్రకటన ద్వారా కత్తిరిశెట్టి ఇందిరా భాయి తమ సాగు హక్కును మంగి రాజప్పడుకు బదిలీ చేసినట్లు ధృవీకరించిందని అన్నారు.1379,1380,1381 ఫసలీ రికార్డుల్లో మంగి రాజప్పడు పేరు నమోదు అయ్యి ఉందని తెలిపారు.1971లో కోలా లలిత తల్లి బొమ్మాళి కాళీయమ్మ మంగి రాజప్పడు వద్ద కొనుగోలు చేసిందని అన్నారు.1382,1383 ఫసలీ రికాడుల్లో బొమ్మాళి కాళీయమ్మ పేరు నమోదు అయ్యి ఉందని అన్నారు.ముప్పై అయిదేళ్ళ సాగు అనుభవంలో ఉన్న భూమికి ఎటువంటి సంబంధం లేని కత్తిరిశెట్టి వెంకట కళ్యాణ చక్రవర్తి పేరున 2006 రెవెన్యూ రికార్డులు క్రియేట్ చేసి భూవివాదానికి రెవెన్యూ అధికారులే తెరలేపారని ఆరోపించారు.బినామీ రికార్డులు ఆధారంగా ధర్మాన ఉదయ భాస్కర రావు భూములు సంబంధం లేని వ్యక్తి వద్ద కొనుగోలు చేసి మానసికంగా,ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఓ.ఎస్.నెం.643/2007 లో కోర్టు పర్మినెంట్ ఇంజన్షన్ ఆర్డర్ ఇచ్చిందని అన్నారు. పై కోర్టుకు ఉదయ భాస్కర రావు వేసిన అప్పీల్ నెం.65/2015 లో చుక్కెదురు అయ్యిందని అన్నారు.కోర్టుల పేరిట ఉదయ భాస్కర రావుకు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆది నుండి భూమికి సంబంధం లేని వ్యక్తులకు అనుకూలంగా రెవెన్యూ అధికారులు నివేదికలు ఇస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి బాధితురాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.తప్పుడు నివేదికలు ఇస్తున్న మండల సర్వేయర్ వి.సూర్యభగవాన్, ఎమ్మార్వో విశ్వేశ్వర రావు,మండల తహశీల్దార్ పంచిరెడ్డి మురళీ కృష్ణ తోపాటు బాధ్యులైన వీఆర్వోలు, ఎం.ఆర్.ఐ.లు, మండల సర్వేయర్లు, తహశీల్దార్లపై సమగ్రమైన విచారణ జరిపి క్రిమినల్ అప్పీల్ నెంబర్స్ 1837/2019 మరియు 1669/2009 లో తప్పు చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు ఆధారంగా తగు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.లేని యెడల న్యాయం కోసం ఫిబ్రవరి 28,2023న ధర్నా,మార్చి12,2023 నుండి మూడు రోజులు రిలే దీక్షలు చేపడతామని తెలిపారు.అంతకు ముందు మండల తహశీల్దార్ ఎన్.వెంకట రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు కోలా లలిత, బాధితురాలు భర్త కోలా నీలకంఠ రావు,డి.హెచ్.పి.ఎస్.జిల్లా ఉపాధ్యక్షులు బలగ రామారావు, ముడిదాన భాస్కర రావు, కారిగ్గి కృష్ణ, ఏ.ఐ.టి.యు.సి.నాయకులు పంచిరెడ్డి అప్పారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ, తవుడు బెహరా, కొల్లి దుర్గారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుని వార్తా సాధనం రేడియో

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సామాన్యుని వార్తా సాధనం రేడియో ఆకాశవాణి నాటికి నేటికి ప్రజల్లో విశ్వసనీయ సాధనంగా నిలుస్తుందని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక లైన్స్ క్లబ్ సెంట్రల్, ఇంటాక్ ల ఆధ్వర్యంలో రేడియో దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ వార్తలు,సమాచారం, వినోదం, విజ్ఞానం విషయాల్లో ప్రధాన మీడియాకు ధీటుగా ప్రత్యామ్నాయ శక్తిగా ఒక్క రేడియో మాత్రమే నిలుస్తుందని అన్నారు. 1920 దశకంలో అందు బాటులోనికి వచ్చిన రేడియో ప్రసారాలను ప్రజలు అత్యద్భుతంగా ఆదరించారన్నారు. తదనంతరం బ్రిటిష్ పరిపాలకులు విప్లవకారులకు అందుబాటులోకి వస్తుందని రేడియోను ప్రోత్సహించకుండా బ్రిటిష్ ప్రభుత్వ ఆధీనంలో బి.బి.సి.ప్రసారాలనే భారత్ ప్రజలకు అందించేవారని నాయుడు వివరించారు. ప్రపంచ స్థాయి వార్తా ప్రసారాలను ప్రజలకు సకాలంలో అందించటంలో ఆకాశవాణి అగ్రభాగన్న ఉందని అన్నారు. సామాన్యునికి అతి చౌకగా లభించే ఏకైక సాధనం రేడియో మాత్రమే నని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేడియోను జన బాహుళ్యంలోకి తీసికివచ్చిన మహెూన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా కొనియాడారు. నిత్యం సమగ్ర, జాతీయ, అంతర్జాతీయ, సమాచారాన్ని, విశ్లేషణలను ప్రజలకు అందించటంలో రేడియో మొదటి స్థానంలో ఉంటుందని రాష్ట్ర ఇంజినీర్ల సంఘం ఉపాధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా వార్తా ప్రసారాలు అందించడంలో ఆకాశవాణి ముందు వరసలో నిలుస్తుందని అన్నారు. వ్యవసాయ, సాగునీటి, విద్యా సమాచారాన్ని ప్రజలకు చేరువ చేయటంలో రేడియో పాత్ర అమోఘం అని వాకర్స్ ఇంటర్నేషనల్ కో..ఆర్డినేటర్ జి.ఇందిరా ప్రసాద్ అన్నారు. అంతకంటే ముందు ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయి పంచారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి.పోలీస్, జిల్లా ఆకాశవాణి ప్రతినిధి ఎస్.జోగి నాయుడు, రోటరీ ప్రతినిధులు ఎం.జగ న్మోహన్‌రావు, బి.ప్రసాద్, పి.పృద్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో జీడి, మామిడి తోటలు దగ్ధం

విశాలాంధ్ర - మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు సి గ్రామ పంచాయతీ పరిధిలో గల సవర మర్రిపాడు, మర్రిపాడు గ్రామాలకు చెందిన సుమారు 20 ఎకరాల జీడి, మామిడి, టేకు తదితర చెట్లు ఉండే ప్రాంతంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు ఉదయం పదిన్నర ప్రాంతంలో సవర మర్రిపాడు గ్రామం వద్ద అగ్ని ప్రమాదం సంభవించి సుమారు 20 ఎకరాల వరకు తోటలు కాలిపోవడానికి కారణమైనట్లు రైతులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు మర్రిపాడు, సవర మర్రిపాడు గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు సంబం ధించిన ఈ తోటల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే ప్రమాదం ఎలా సంభవించిందో తెలియ రాలేదని రైతులు చెబుతున్నారు. మంటలు సంభవించిన తర్వాత సవరమర్రిపాడు గ్రామస్తులు గుర్తించి వెంటనే టెక్కలి అగ్నిమాపక సిబ్బంది వారికి సమాచారం అందిం చడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకునే సమయంలోపే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో రైతులు బకెట్ల ద్వారా మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంటలు అదుపు లోకి రాలేదు. ఆయా సమయంలో అగ్నిమాపక దళం వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. వీఆర్వో రాజు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జరిగిన నష్టాన్ని గుర్తించి నివేదికను పై అధికారుల దృష్టిలోకి తీసుకువెళ్ల నున్నట్లు ఆయన తెలియ జేశారు. జీడి, మామిడి, తోటల్లో పువ్వు పిందె వచ్చిన సమయంలో ఇటువంటి ప్రమాదం చోటు చేసుకోవడంతో రైతులు కన్నీరు మున్నేరుగా విని పిస్తున్నారు. న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

కోడ్ కూసిన.... వీరికి పట్టదా...

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలం లో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుద లైన ప్పటికీ సంబందిత అధికారులు ఎన్నికల కోడ్ అమలుచేసిన దాఖలాలు కనిపించటం లేదు. వివిధ పార్టీలకు చెందిన బ్యానర్లు, కటౌట్లు, శిలాఫలకాలపై పేర్లును తొలగింపు కార్యక్రమం చేయటంలో సంబందిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయంకు వెళ్ళిన దారిలో టీడీపీ భ్యానర్ దర్శిన మిస్తున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే నూతనంగా నిర్మించిన ప్రయాణీకుల విశ్రాంతి గది, బ్లూక్‌బాడ్ సెంటర్‌లో నాయకుల పోటోలతో కూడిన ఫ్లెక్సీలు , మారుమూల పంచాయతీల పరిధిలో వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, శిలాఫలకాలు, ప్రభుత్వ కార్యాలయాలుపై నాయకుల పేర్లు దర్శనమిస్తున్నప్పటికీ వాటిని తొలగించటంలో చొరవ చూపటం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన మొదటి రోజునే జిల్లా కలెక్టర్ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ కోటబొమ్మాళి మండల స్థాయి సిబ్బందికి చీమకుట్టినట్లు అయిన లేదు. ఇప్పటికైనా ఎంపీడీఓ స్పందించి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బోదవ్యాది నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : బోదవ్యాది నివారణ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమ రాష్ట్ర ఉప సంచాలకులు ఎ.టి. రామనాథరావు అన్నారు. మన్యం జిల్లా ఆసుపత్రి సమావేశ భవనంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు ఆధ్వర్యంలో సోమవారం హెల్త్ సూపర్ వైజర్ లకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బోదవ్యాదిని పూర్తి స్థాయి నిర్మూలన లక్ష్యంగా ఈ నెల 15 వ తారీఖున బోదవ్యాది నివారణ మందుల ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరాల పైబడిన వారందరికీ డిఇసి మరియు ఆల్బెండజోల్ మాత్రలు వైద్య సిబ్బందిచే వేయడం జరుగుతుందని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మరియు గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. గర్భిణీలు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారికి ఈ మందులు ఇవ్వరాదని అదేవిధంగా ఖాళీ కడుపున మాత్రలు వేయరాదని సూచించారు. డాక్టర్ బి.జగన్నాథరావు మాట్లాడుతూ ఫైలేరియా (బోదవ్యాది) నివారణ మందులు జిల్లా లో అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయడం జరిగిందని తదితర శాఖల సమన్వయంతో జిల్లాలో పూర్తి స్థాయిలో కార్యక్రమం నిర్వర్తించి ఫైలేరియా రహిత జిల్లా గా తీర్చి దిద్దాలని సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఎమ్. తులసి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన రావు, డిటిసిఒ శ్యామ్ కుమార్ ఎపిడిమియాలజిస్ట్ ఎమ్. నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారి ఎమ్. వినోద్, ఎఎమ్ఒలు డివి. రమణ, సూర్యనారాయణ, కన్సల్టెంట్ జి.రామచంద్ర పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూ అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి సహక రించాలని వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని కలిసి కోరారు. విశాఖపట్నంలో సోమవారం ఆయనను కలిసి వర్సిటీలో ప్రస్తుతం చేపదుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. అలాగే వర్సిటీ మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి సానుకూలంగా స్పందించాలని చెప్పారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా సరోజినీ నాయుడు జయంతి

విశాలాంధ్ర - శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో నైటింగేల్ ఆఫ్ ఇండియ సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర ఆదిత్య డిగ్రీ కళాశాలల డైరెక్టర్ పి.రామకృష్ణారెడ్డి, బి.ఎస్ చక్రవర్తి సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి సరోజిని నాయుడు దేశానికి, మహిళాభివృద్ధికోసం చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత సరోజినీనాయుడు లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ మాట్లాడుతూ సరోజినీ నాయుడు దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో పాటుపడ్డారన్నారు, దేశ మొట్టమొదటి మహిళా గవర్నర్ గా కూడా పని చేసి పదవికి ఎంతో వన్నె తెచ్చారన్నారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ పిఓ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సరోజిని నాయుడు జయంతిని జాతీయ మహిళా దినోత్సవం గా కూడా జరుపుకుంటున్నామన్నారు. అలాంటి వారిని మనం స్మరించుకోవడం మన అదృష్టమన్నారు. కార్యకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు, మహిళా ఉపాధ్యాయులు మాధవి, మౌనిక, వనజాక్షి, లైబ్రేరియన్ కమల్ కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

15న ఎ.ఐ.ఆర్‌లో కొండలరావు ప్రసంగం

విశాలాంధ్ర - పొందూరు : అంతర్జాతీయ తెలుగు కథా రచయిత "పాలగుమ్మి పద్మరాజు జీవితం, సాహిత్యం"అనే అంశంపై స్థానిక సాహితీవేత్త వాండ్రంగి కొండలరావు ప్రసంగాన్ని ఆకాశవాణి(ఎ.ఐ.ఆర్)విశాఖపట్నం కేంద్రం ఈనెల 15న ఉదయం 7.15 గంటలకు ప్రసారం చేస్తుంది. ఈ మేరకు ప్రసారభారతి అధికారులు రచయితకు ధ్రువీకరణ పత్రాన్ని ప్రదానం చేశారు. కాగా వివిధ కళా,సాహిత్యాంశాలపై రచయిత కొండలరావు ప్రసంగాలను ఎ.ఐ.ఆర్ హైదరాబాద్, ఆదిలాబాద్, విశాఖపట్నం కేంద్రాలు ప్రసారం చేశాయి.

సిబ్బంది అభియోగాలపై వివరాల సేకరణ

విశాలాంధ్ర - మెళియాపుట్టి : మండలంలోని సామాజిక తనిఖీలో భాగంగా అభియోగాలు మోపబడిన పలువురు సిబ్బంది పై శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు వివరాలు సేకరించారు. సోమవారం ఆయన మండలంలోని ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ఉపయోగాలు మోపబడిన సిబ్బందితో సమావేశమయ్యారు. 13, 14, 15వ విడతలలో నిర్వహించిన సామాజిక తనిఖీలలో భాగంగా ఎం బుక్ రికార్డింగ్లలో తేడాలు, చనిపోయిన మొక్కలకు వివరణ వాటికి సంబంధించిన రీప్లేస్మెంట్ ఫోటోలు సేకరించారు. పనుల వద్ద సూచికలు లేవని సామాజిక తనిఖీ గుర్తించిన మేరకు సూచికలను ఏర్పాటు చేసి సాంకేతిక సిబ్బంది ఫోటోలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు మాట్లాడుతూ వీరందరికీ ప్రత్యేకంగా హియరింగ్ చేసి పూర్తి వివరాలు శ్రీకాకుళం జిల్లా డ్వామా పీడీ వారికి అందజేయన్నట్లు తెలిపారు. అభియోగాలు రుజువైన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటుగా అసిస్టెంట్ జిల్లా విజిలెన్స్ అధికారి సురేష్, హెచ్.ఆర్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో చంద్రకుమారి ఏపీడి రవి, ఏపీవో సురేష్, ఈసీ ఆదినారాయణరెడ్డి, క్షేత్ర, సాంకేతిక స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ భద్రాచలం కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని దూగానపుట్టుగ గ్రామపంచాయతీ సర్పంచ్ దూగాన భద్రాచలం కుటుంబానికి మాజీ మంత్రి గౌతు శ్యామసుందర్ శివాజీ సోమవారం పరామర్శించారు. సర్పంచ్ మాతృమూర్తి దూగాన సరోజినమ్మ ఇటీవలి మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ దుగానపుట్టుగ గ్రామానికి చేరుకుని సరోజనమ్మ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కవిటి మండల ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ తదితర వైకాపా నేతలు భద్రాచలం కుటుంబానికి పరామర్శించే తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.శివాజీ తో పాటు శ్రీశయన సంఘ అధ్యక్షులు ఎల్.దీనబంధు, సంఘ ప్రతినిధులు హేమారావు, ఇంద్రరావు, పర్రి కృష్ణారావు, మోహన్, గ్రామ పెద్దలు వైకుంఠ రావు,రుద్రయ్య, రాజారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా కుంభ సంక్రమణం పూజలు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని జగతి గ్రామంలోని మరల పోలమ్మ, బెజ్జిపుట్టుగ, బోరివంక గ్రామాలలోని కాళీమాత కవిటి గ్రామంలోని శ్రీ చింతామణి కపాసుకుద్ది పంచాయితీ కొరికానపుట్టుగ గ్రామంలో కొలువైన శ్రీ భూలోక మాత అమ్మవారి ఆలయంలో వైభవ వేదంగా కుంభ సంక్రమణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజాము నుండి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు కరగాన ఏకాంబరరావు కుమారుడు ప్రముఖ దినపత్రిక ప్రతినిధి కరగాన లక్ష్మీనారాయణ దంపతులు ఆర్థిక సహకారంతో శ్రీ భూలోక మాత అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం స్థానిక సంగీత కళాకారులచే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంగీత కచేరి కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తులు తోపాటు చుట్టుప్రక్కల గ్రామాల భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాస్తవాలు మాట్లాడితే వైసీపీ నాయకులకు ఉలికెందుకు?

టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర - పొందూరు : వైఎస్ వివేకానంద హత్య కేసులో టీడీపీ ముద్రించిన జగనాను రక్త చరిత్ర పుస్తకంపైనా హత్యపై వైసీపీ అగ్రనాయకుల హస్తంపైనా మాట్లాడితే వైసీ పీ నాయకులకు ఉలికెందుకని టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రశ్నించారు. మండలం తాడివలస గ్రామంలో టీడీపీ నాయకుల కుటుంబాలను రవికుమార్ పరామర్శిం చారు. అనంతరం సర్పంచ్ మరెమ్మ గృహంలో విలేఖరులతో మాట్లాడారు. వివేకానంద మాతృకేసులో అవినాష్రెడ్డిని సీబిఐ విచారించిన తరువాత ఎవరెవరితో మాట్లాడారో ఫోన్ నెంబర్ల కాల్ రికార్డులు బయటపడుతున్నాయని దీని ద్వారా ఎవరెవరి హస్తం ఉందో త్వరలోనే తేలుతుందన్నారు. హత్య జరిగిన వెంటనే సొంత పత్రిక సాక్షిలో ఎటువంటి సాక్షలు లేకుండా నిర్యాణం భక్త చరిత్ర అని తప్పుడు కథనం రాయించారని కానీ నేడు సీబీఐ వేళ్ళన్నీ వైసీపీ నాయకులవైపే చూపుతున్నా సిగ్గులేకుండా సమర్థించుకుం టున్నారని ఎద్దేవా చేసారు. ఎన్నికలలో సానుభూతి కోసమే కోడి కత్తికేసును వివేకా హత్య కేసును వాడుకున్నారని స్పష్టమవుతోందని శవరాజకీయాలు చేయడం వైసీపీకి, ముఖ్యమంత్రి జగన్రెడ్డికి అలవాటేనని విమర్శించారు. లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే వైసీపీ ప్రభుత్వం పోలీసులతో తప్పుడు వీడియోలు తీసి వైసీపీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఎన్ని కుయుక్తలు పన్నినా లోకేష్ పాదయాత్రకు ప్రజలునుంచి మాత్రం స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ తో పాటు టీడీపీ నాయకులు చోళ్ళ శ్రీనివాసరావు, మండల తెలుగు రైతు నేతలు, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

స్పందన అర్జీలు పరిష్కరించుటలో జాప్యం ఉండరాదు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రజల అర్జీలు పరిష్క రించటలో జాప్యం ఉండరా దని, అర్జీలు పట్ల సత్వరం స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసు కోవాలని జిల్లా ఎస్పీ జిఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ రాధిక 34 మంది పిర్యాదు దారులు నుంచి అర్జీలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇందులో భాగంగా స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమ స్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాది దారులకు చట్ట పరిధిలో పరిష్కరించి సత్వర న్యాయం అందించ వలసిందిగా సంబంధిత అధికారులుకు ఆదేశించారు. పై ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే ఎస్పీ కార్యాలయానికి పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.వాసుదేవ్ పాల్గొన్నారు.